విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 14, అక్టోబర్ 2023

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల: అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్ప డిన ఘటన మండలంలోని కొండమీద పల్లి (దళవాయిపల్లె) గ్రామంలో శుక్ర వారం చోటుచేసుకుంది. వివరాల మేర కు గ్రామానికి చెందిన గజ్జల శ్రీనివాస్ రెడ్డి (42) విషపు గుళికలు మింగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు.గత రెండుళ్లుగా సాగుచేసిన పంటల్లో నష్టం రావడంతో శ్రీనివాస్ రెడ్డి అప్పులు పాలయ్యాడు. సొంత పొలంతో పాటు కొలిమిగుండ్ల సమీపంలో కౌలుకు తీసుకొని మిరప సాగుచేసి నష్టపోయాడు.దీంతో అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో విషపు గుళికలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు గమనించి తాడపత్రి ప్రభు త్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. సమాచా రం తెలుసుకున్న జిల్లా జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, లాయర్ మహేష్ రెడ్డి కొలిమిగుండ్ల ఉపసర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు గ్రామానికి వెళ్లి శ్రీనివాస్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని తెలిపారు.

దర్గాను దర్శించిన మాజీ ఎమ్మెల్యే భూమా

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాల పట్టణం గాంధీచౌక్ లో వెలసిన శ్రీ హాజరత్ సయ్యద్ గులాబ్‌షా వలి రఫాయి అహమ్మది రహమాతుల్లాయి అలైవారి ఉరుసు సందర్భంగా నంద్యాల టీడీపి ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి దర్గాను సందర్శించారు. ఉరుసు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నదాన కార్య క్రమంలో పాల్గొని భక్తులకు, ప్రజలకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని దర్గా ధర్మకర్తలు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖలీల్, కౌన్సిలర్ మాబువలి, నాయకులు మస్తాన్ బాబా, జియా తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన పకడ్బందీగా చేపట్టండి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

విశాలాంధ్ర - నంద్యాల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమస్థాయి పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని రాష్ట్రఎన్నికల ప్రధాన అధి కారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలె క్టర్లకు సూచించారు. శుక్రవారం ఎలక్షన్ కమి షన్ కార్యాలయం నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధా నాధికారి ముఖేష్ కుమార్ మీనా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్ సి) ప్రక్రియపై అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన ప్రక్రియను ఈ నెల 16వ తేది నుండి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. దాదాపు 20 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లను సూచించారు. బెల్ ఇంజనీర్లు, రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జాగ్రత్తగా చేపట్టాలన్నారు. జిల్లాకు వచ్చిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లకు సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పూర్తి స్థాయిలో పరిష్కరించి అవగాహన కల్పించాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాల మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసాను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య శుక్రవారం కలిసి మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ నంద్యాల మున్సిపల్ పరిధిలో కార్మికులకు అనేక సమస్యలున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని, చనిపోయిన కార్మికులస్థానంలో వారి కుటుంబం లోని ఒకరికి ఉద్యోగం, చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషి యా చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ కార్మికుల వలె సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు, షూసు, బ్లౌజులు ఇవ్వాలని చైర్ పర్సన్ షేక్ మాబునిసాకు వినతిపత్రం ఇవ్వడం జరిగినది. అలాగే కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు నిబంధన ప్రకారం రూ. 26 వేలు జీతం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేసేంతవరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతామన్నారు. కార్మికులందరికీ ప్రభుత్వ ఉద్యోగస్తుల మాదిరిగానే పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాదు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.శివ బాలక్రిష్ణ, పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, ప్రతాప్, శివ రాముడు, మస్తానమ్మె తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర -జూపాడుబంగ్లా: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని సచివాలయం-2లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఈవైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, 7 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసు కోవాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోటె బాలయ్య, ఎంపీటీసీ కృపాకర్, వైసీపీ మండల నాయకులు పెద్దన్న, శివానందరెడ్డి, దేవసహాయం తాటిపాడు కృష్ణారెడ్డి, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దిలీప్‌రాజు, పైపాలెం ఇనియతుల్లా, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీవో నూర్జహాన్, ఈఓఆర్డీ చక్రవర్తి, ఏపీవో గౌరీబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీపై రాజకీయాలు తగదు

విశాలాంధ్ర -నంద్యాల: స్థానిక బొగ్గులైన్, గాంధీనగర్ ప్రాంతవాసులకు పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాలపై టీడీపీ నాయకులు రాజకీయాలు చేయడం తగదని ఎమ్మెల్యే శిల్పా రవి పేర్కొన్నారు. శుక్రవారం బొగుగలైన్, గాంధీనగర్ వాసులకు కేటాయించిన ఇళ్లస్థలాల లేఅవుట్లను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న వసతులను అడిగి తెలుసుకొని పనులు వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తుంటే టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తూ రాజకీయాలు చేస్తున్నారని, పేదల ప్రాణాలు ఎంతో విలువైనవని, వారి ప్రాణాలను కాపాడేందుకు, వారి సొంతింటి కలను నెరవేర్చేందుకు తాము మంచి పని చేస్తుంటే టీడీపీ వారు చూస్తూ ఊరుకోలేక కోర్టులకు వెళ్తున్నారన్నారు. వారికిచ్చిన మాట ప్రకారం కేటాయించిన లే-అవుట్లలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. అనవసరంగా కుందూ ప్రాంతంలో నివాస యోగ్యంగా లేదని లేనిపోని రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఇళ్ల స్థలాలను ఇవ్వడమే కాకుండా వారికి హౌసింగ్ లోన్ మంజూరు చేయిస్తామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ పాంషా వలి, నాయకులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పని సరి

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రతిరైతు సాగు చేసిన పంటలకు ఈక్రాప్ బుకింగ్ తప్పని సరిని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి తెలిపారు. స్థానిక రెండో రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించి. ఈ పంట నమోదు చేసుకున్న రైతులు ఈ.కె.వై.సి. చేసుకోవాలని తెలిపారు. పి.ఎం.కిసాన్‌కు మండలంలో 125 రైతులు ఆధార్‌లింక్ లేని వారున్నారని గుర్తు చేశారు.

రాయితీపై పనిముట్లు పంపిణీకి సిద్ధం చేయండి

విశాలాంధ్ర- నందికొట్కూరు : రాష్ట్ర వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తూ సబ్సిడీపై రాయితీలు ఇవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఆత్మ భవనంలో మండల వ్యవసాయ అధికారి షేక్షావలి ఆధ్వర్యంలో మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పురుగుల మందులు, ఎరువులను 50 శాతం సబ్సిడీతో రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాటితో పాటు జింక్, జిప్సం, బోరాన్ రైతులకు 50 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సబ్సిడీతో తార్ఫాలిన్స్ పట్టాలు, స్ప్రేర్ ట్యాంకులు, ట్రాక్టర్ పనిముట్లను వ్యక్తిగత రైతులకు ఇవ్వాలని సూచించారు. ఈ పంట నమోదు మరియు ఈ కేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు. తక్కువ వర్షపాతం ఉన్నందున పంట నష్ట పరిహారాలకు నివేదికలు పంపాలని సూచించడం జరిగింది. ఎన్ ఎఫ్ ఎస్ ఎం స్కీములో రైతులకు పురుగుల మందులను రాయితీ పై ఇవ్వాలని మరియు పప్పుశనగ, మినుములను ఎక్స్ట్రా అలాట్మెంట్ తెప్పించాలన్నారు.పత్తి, మొక్కజొన్న,కంది పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్‌ను ఖరీఫ్ 2002 వరకు ఇవ్వాలని ఈ సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు.

ఈ సమావేశంలో మండల వెటర్నరీ అధికారి మరియు జడ్పీఎన్ఎఫ్ సిబ్బంది, ఆర్.బి.కె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ: మండలంలోని బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన సుమలత, స్వాతి, శ్రీవిద్యలు ఈనెల 12వ తేదీన జిల్లాస్థాయిలో కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో జరిగిన అండర్-14 షాట్ పుట్ పోటీల్లో, అండర్ 17 విభాగంలో హై జంపు, తాడాటలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు విద్యార్థినులను హెచ్ఎం, క్రీడా ఉపాధ్యాయుడు దాస్, ఆదినారాయణరెడ్డిలు అభినందించారు.

ఘనంగా స్వాగతోత్సవ వేడుకలు



విశాలాంధ్ర- బనగానపల్లె: స్థానిక పభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.స్వర్ణ లత దేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సబిహాబేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల జీవితం అత్యంత ముఖ్యమైనదని, కష్టపడి చదివి కుటుంబానికి, కన్న వూరికి పేరు ప్రఖ్యాతలు తీసుకోరావాలని కోరారు. దేశ భవిషత్తు విద్యార్థుల చేతులలోని ఉందని తెలిపారు. ఈ ఉత్సవంలో విద్యార్థిని విద్యారులు ఉత్సహంగా చేసిన నృత్య ప్రదర్శనలు విశేషాంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యం అందించడమే జగనన్న లక్ష్యం

విశాలాంధ్ర -కోవెలకుంట్ల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి ఉచిత వైద్యం అందించడమే జగనన్న లక్ష్యమని చిన్న కొప్పెర్ల సర్పంచ్ పద్మావతి అన్నారు. శుక్రవారం చిన్నకొప్పెర్ల ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో సయ్యద్ ఉన్నిసా మాట్లాడుతూ 15 రోజుల నుండి చిన్నకొప్పెర్లలో వైద్య సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసు కొన్నారు. ప్రస్తుతం అనారోగ్యంగా ఉన్న వారందరికీ కర్నూలు నుండి వచ్చిన ప్రత్యేక వైద్యనిపుణులచే దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించారు. ప్రజలకు ప్రభుత్వాలు విద్య,వైద్యం,చదువు ఈ మూడు ప్రతి గ్రామానికి అందించినపుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నెరవేరనున్న పట్టణ ప్రజల సొంతింటికల

18న టిడ్కో గృహాల ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ప్రముఖులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణ వాసులకు సొంతింటి కల సాకారం కానుంది.. 1392 గృహాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి.ఈనెల 18న ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో నూతనంగా నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను ప్రారంభించేందుకు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఉప ముఖ్య మంత్రి అంజాద్‌భాష, పురపాలకశాఖ మాత్యులు ఆదిమూలపు సురేష్, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, రాష్ట్ర నీటిపారుదలశాఖ సలహా మండలి సభ్యులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితర అధికారులు రానున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టిడ్కో ఎస్.ఈ:

పట్టణంలో ఈనెల 18న టిడ్కో గృహాలను ప్రారంభించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా అక్కడ చేరే లబ్ధిదారులకు నీటికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవని శుద్ధ జలాన్ని అందిస్తామని అధికారులు చెప్పడం జరిగింది. ఇందులో భాగంగా టిడ్కో ఎస్.ఈ రాజశేఖర్, కమిషనర్ రమేష్‌బాబు శుక్రవారం ఎమ్మెల్యే గంగులను కలిసి టిడ్కోగృహాలకు సరఫరా చేసే నీటిని చూపించడం జరిగింది. చింతకుంట్ల చెరువు నుండి నీటిని శుద్ధిచేసి తర్వాత క్లోరినేషన్ చేసి అందజేస్తామని వారు తెలిపారు. శుద్ధి చేయకముందు ఉన్న నీటిని, శుద్ధి చేశాక వచ్చిన నీటిని బాటిల్లో నింపి ఎమ్మెల్యేకు చూపించారు.కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేంద్రారెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం టిడ్కో ఎస్. ఈ టిడ్కో గృహ సముదాయాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -అవుకు : రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షుడు చల్లా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయంలో పరిధిలో గల రైతులకు సబ్సిడీ పప్పు శనగలను రైతులకు అందించారు. 120 మంది రైతులకు 140 క్వింటాళ్ల పప్పు సెనగను అందించారు. అలాగే 40 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్ పైపులు నమోదు చేసుకున్న 30 మంది రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జయకృష్ణ మరియు రైతులు పాల్గొన్నారు.

15 నుండి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు

విశాలాంధ్ర- శ్రీశైలం : ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలో ఈనెల 15 నుండి దసరా మహోత్సవాలను నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కార్య నిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. దసరా ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలం కరణలు, గ్రామోత్సవం నిర్వహించనట్లు వెల్లడించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలతో దేవాలయ ప్రాంగణం, మాడ వీధులన్నీ కూడా అలంకరించటంతో పాటు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వామి అమ్మవార్ల నిత్య కైంకర్యాలు యధావిధిగా కొనసాగుతాయని వివరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులరద్దీ దృష్ట్యా కొన్ని ఆర్జిత సేవలు కూడా నిలిపివేసి, భక్తులు మహోత్సవాలు తిలకించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొని స్వామి అమ్మవార్లకు కృపకటాక్షాలు పొందాలని కోరారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర -బనగానపల్లె: ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివరామయ్య, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ పేర్కొన్నారు. పట్టణంలో సచివాలయం 5 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఒక్కరికి ఉచిత వైద్యం అందించడమే జగనన్న లక్ష్యమని పేర్కొన్నారు. అందులో భాగంగానే 1,057 ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో నారాయణ, భానుముక్కల సొసైటీ చైర్మన్ నీది శ్రీనివాసులు, డాక్టర్ శివ శంకర్, డాక్టర్ సోహెల్, ఎంపిహెచ్ నల్లగట్ల వెంకటేశ్వర్లు, పోలూరు కృష్ణ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లు దొంగలించిన కేసులో ముద్దాయిల అరెస్ట్

50 లక్షల విలువ గల సెల్ ఫోన్లు.రెండు మారుతి కార్లు సహా మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం -జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

విశాలాంధ్ర - నంద్యాల : హర్యానా రాష్ట్ర కంపెనీకి చెందిన కంటైనర్ లో 722 మొబైల్ ఫోన్లు దొంగలించినట్లు ఐటిఎస్ మేనేజర్ బల్జిత్ సింగ్ ఫిర్యాదు మేరకు కంటైనర్ డ్రైవర్లయిన వాజిద్ ఖాన్, రాహిల్ లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.50 లక్షల విలువ గల 722 సెల్ ఫోన్లు, రెండు మారుతి స్విఫ్ట్ కార్లు, మూడున్నర కిలోల గంజాయి రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. వీరితో పాటు మరో సూత్రధారుడు నయీమ్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఇందుకు సంబంధిన వివరాలను ఎస్పీ వెల్లడించారు.ఐటిఎస్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్న వాజిద్‌ఖాన్ హైదరాబాద్‌కు చెందిన సునీల్‌తో పరిచయం చేసుకొని సెల్‌ఫోన్లను కొట్టేసెందుకు ప్లాన్ చేసుకున్నాడు. గురుగ్రామ్ జిల్లాలోని గోడౌన్ నుండి బెంగళూరు గోడౌన్ కు వాజిద్ ఖాన్, రాహిల్ లు ఆదిలాబాద్ హైవే పక్కన కంటైనేర్‌ను ఆపి దాని డిజిటల్ లాక్‌లను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి దానిలోకి నయం మనుషులు ముగ్గురు ఎక్కి హైదరాబాద్ వైపుకు వెళుతూ ఉండగా 722 సెల్ ఫోన్లను సంచులలో మూటలు కట్టి చేగుంట వద్ద కంటైనర్ ఆపి అక్కడ నయిం, సునీల్‌కి చెందిన కార్లలో 12 సంచులకు ఫోన్లను నింపుకొని కంటైనర్ ను బెంగళూరుకు తీసుకెళ్లి వదిలిపెట్టమని చెప్పి రాహిల్, నయీం మనిషి మరొక డ్రైవర్ తో పంపించారు. మిగిలిన వారు హైదరాబాదులోని సునీల్ వాళ్లింటికి వెళ్లారు. కంటైనర్ ను తీసుకొని ఇద్దరు డ్రైవర్లు బెంగళూరుకు పోతుంటే ఐటిఎస్ కంపెనీ వారు ఫోన్ చేసి కంటైనర్ లాక్ లు వీడియో కాల్ చేసి చూపించమని రెండవ డ్రైవర్ రాహిల్‌ను అడగ్గా వారు ఆ కంటైనర్ ను డోన్ మండలం ఓబులాపురం మెట్ట వద్ద విడిచిపెట్టి పారిపోయినట్లు ఎస్పీ తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు శుక్రవారం హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిలో డోన్ సమీపంలో మేవాత్ ధాబా ముందు ముగ్గురు వ్యక్తులు వాజిద్‌ఖాన్, షరీఫ్‌ఖాన్, సునీల్ భాను దాస్ తో రెండు మారుతి స్విఫ్ట్ కార్లు పెట్టుకొని అను మానాస్పదంగా ఉన్నారని, రాబడిన సమాచారం మేరకు రెండు కార్లతో పాటు మూడున్నర కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హర్యానా రాష్ట్రానికి వెళ్లినేరాన్ని చేదించుటలో, నేరస్తులను పట్టుకొనుటలో తీవ్రప్రయత్నాలు చేసిన డోన్ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ సిఐ షాదిక్ అలీ, సిసిఎస్ సిఐ రామకృష్ణ, డోన్ రూల్ ఎస్ఐ పి.సుధాకర్ రెడ్డి, ఎస్ఐ రాకేశ్, టీంను లీడ్ చేసిన డోన్ డిఎస్పి వై. శ్రీనివాసరెడ్డిలను జిల్లా ఎస్పీ అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విశ్వశాంతి విద్యార్థి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ నెల 12న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆళ్లగడ్డ విశ్వశాంతి పాఠశాల నుండి అండర్ - 17 బాలుర విభాగంలో చరణ్ తేజ 400 మీటర్ల పరుగు పందెం, 400 రిలే పోటీల కు ఎంపిక కావడం జరిగిందని విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలిలో జరగబోయే అంతర్రాష్ట్ర స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.శిక్షణ ఇచ్చినటువంటి ఆర్ఆర్ అకాడమీ కోచ్ సుబ్బరాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు విక్రమ్ ను శ్రీనాథ్ రెడ్డి అభినందనలు తెలిపారు.

స్కాలర్ స్కూల్‌లో దసరా సంబరాలు

విశాలాంధ్ర-నందికొట్కూరు : స్థానిక స్కాలర్ పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పురపాలక కమిషనర్ కిషోర్ హాజరయ్యారు. ఈ నవరాత్రుల వేడుకల్లో స్కూల్ విద్యార్థులు నవదుర్గల వేషధారణలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.స్కాలర్‌స్కూల్ డైరెక్టర్ శివప్రసాద్, నంది కాలేజీ ప్రిన్సిపల్ శ్రీకాంత్, విజ్జి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణకు పాటుపడాలి

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల : గో సంరక్షణకు ప్రతి ఒక్కరూ కర్తవ్యంగా భావించి పాటుపడితే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని తిరుపతి తిరుమల దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డా.మల్లు వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్ర వారం మండలంలోని తిమ్మనాయునిపేట గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన పూజలు ఆయన పాల్గొన్నారు.

శాంతిని కోరుతూ.. సన్మార్గాన్ని ఎంచుకోవాలి

విశాలాంధ్ర - పాములపాడు : ప్రపంచ శాంతి కొరకుబుద్ధుడు,అశోకుడు, అంబేద్కర్ చూపిన మార్గాన్ని ఎంచుకోవాలని బహుజన సమాజ్ నియోజకవర్గ ఇన్చార్జి ఎల్ స్వాములు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గోపాల్, బుద్ధిష్ట నాయకులు అబ్రహం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గురు బౌద్ధ గురువులు మరియు 40 మంది శిష్యులతో కూడిన బృందం కేరళ నుండి మొదలైన కర్నూలు, నంద్యాల జిల్లాలో యాత్రలో భాగంగా పాములపాడు చేరుకున్న సందర్భంగా వారికి ఘనంగా స్వాగతం పలికారు.

రాష్ట్రస్థాయి బేస్బాల్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర -చాగలమర్రి : మండల పరిషత్ బాలురన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కోటయ్య శుక్రవారం తెలిపారు. సెప్టెంబరు 29న నంద్యాల ఎస్‌పిజి ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్ -17 బాలుర విభాగంలో లక్ష్మీ నరసింహ, వసంత, ఈశ్వర్, వైష్ణవి, అండర్ -14 విభాగంలో పండు, జెర్సీలో ఎంపిక అయ్యారు అన్నారు. త్వరలో గుంటూరు,నంద్యాల జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 75 లక్షలతో ఏర్పాటు చేసిన అదనపు గదులు మౌళిక సదుపాయాలు (బెంచీలు, యల్ఈడి టీవీలు, ఫ్లోరింగ్,పెయింటింగ్) సంబంధించిన అభివృద్ధి పనులు ఎమ్మెల్యే గంగుల బ్రిజెంద్రారెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు సలాం, ఎంపీపీ వసీం, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ దిల్షాద్ ముజఫ్ఫర్, వైసీపీ సీనియర్ నాయకులు నజీర్,ఆళ్ళగడ్డ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరహరి, శిరివెళ్ల మండల కన్వీనర్ ఇందూరి ప్రతాప్ రెడ్డి, చైర్మన్ కరీంబాష శిరివెళ్ల సర్పంచ్ సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉం దాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ నవీన్ కుమార్ తెలి పారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో బ్యాంకులో ప్రజలకు అందిస్తున్న సేవలను కళాజాత రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హత గల ప్రతిఒక్కరికి రిటైల్ రుణాలు అందజేస్తామన్నారు. ఏపీజీబీ మేనేజర్ హరీష్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ రషీద్, క్యాషియర్ హిమ కామాక్షి, బ్యాంకు సిబ్బంది, బీసీలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

రైతులు విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర -ఆత్మకూరు రూరల్ : మండలంలోని ఆత్మకూరు రైతు భరోసా కేంద్రం నందు మాబ్ చైర్మన్ కొండలరావు అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కొండలరావు మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం నందు మినుము, శనగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవలెను అన్నారు. సిద్దాపురం చెరువు కింద ఉన్న పిల్ల కాలువలు ఎంజి ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధులతో పూర్తి చేయాలని కోరడం జరిగింది. ఖరీఫ్ లో పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేనిచో వారికి పంటల బీమా, పంట నష్టపరిహారం వర్తించవని తెలిపారు.కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు అరుణ, పట్టు పరిశ్రమ శాఖ అధికారి అరుణ, ఉద్యానవన శాఖ శ్రీనివాసులు, మత్స్య పరిశ్రమశాఖ హనోక్, నీటిపారుదల శాఖ ఏఈ శరభారెడ్డి, రైతు సంఘం ప్రెసిడెంట్ బైరాపురం మహబూబ్ బాషా, వ్యవసాయశాఖ సిబ్బంది, అడ్వైజరీ బోర్డు మెంబర్స్, రైతులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర- నందికొట్కూరు : పట్టణంలోని దసరా ఉత్సవాలకు ఆత్మకూరు రోడ్డు సమీపంలోని జమ్మిచెట్టు, శమీ వృక్షం దగ్గర ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రతి ఏడాది మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శమీ వృక్షం దగ్గర ఉత్సవాలు నిర్వహణ, ఏర్పాట్ల విషయమై చర్చించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ నాయబ్ రసూల్, దసరా ఉత్సవ కమిటీ పెద్దలు బీటెక్ రాజు, శ్రీధర్, శ్రీకాంత్, రంగారెడ్డి, శివప్రసాద్, శ్రీకాంత్‌గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, దేశెట్టి శ్రీనివాసులు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 14, అక్టోబర్ 2023

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర- పెద్దకడబూరు : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో పెద్దకడబూరులోని స్థానిక మండల రిసోర్స్ కేంద్రంలో మండల విద్యాధికారిణి సువర్ణ సునియంకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్టీయూ మండల కార్యదర్శి సాబీర్ మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులకు నేటి వరకు జీతాలు రాలేదన్నారు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రతి నెల 1న వచ్చేలా చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్లలో నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. మెడికల్ లీవులు, ప్రమోషన్ ఆరియర్స్‌కు సంబంధించిన బిల్లులు వెంటనే మంజూరు చెయ్యాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యాధికారికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు తులసిరాం, జిల్లా కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

15న టీడీపీ చేపట్టనున్న శాంతి ర్యాలీకి సీపీఐ మద్దతు

విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఈనెల15న కర్నూలు నగరంలో తెలుగుదేశం పార్టీ చేపట్టనున్న శాంతి ర్యాలీకి తమ మద్దతు తెలపాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మారం సుబ్బారెడ్డిలు శుక్రవారం సీఆర్ భవన్‌లో సీపీఐ నాయకులను కలసి మద్దతు కోరారు. ఇందుకు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య,జిల్లా కార్యవర్గసభ్యులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డిలను కలసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర్‌గౌడ్, బీవీ జయనాగేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ ప్రతిపక్షపార్టీలను భయభ్రాంతులకు గురిచేస్తుందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి వేదిస్తుందన్నారు. కేసుల్లో ఎలాంటి ప్రమేయం లేకున్నా అక్రమ కేసులు పెట్టిందని నెల దాటినా కోర్టుకు నేటికి ఆధారాలు చూపకుండా వాయిదాలు వేస్తూ జైలులో ఎక్కువ రోజులు ఉంచేందుకు కుట్రలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతివక్షపార్టీల వ్యవహరిస్తున్న తీరుపై 15వ న చేపట్టిన శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొనాలని కోరారు. అందుకు స్పందించిన సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు చేసిన తీరును సీపీఐ రాష్ట్రసమితి కూడా తప్పుపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తుందని ఇది దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యబద్దంగా ఆందోళన చేస్తుంటే కూడా ప్రభుత్వం నిర్బంధం చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్యంకు గొడ్డలి పెట్టులాంటిదన్నారు. 15న టీడీపీ తలపెట్టిన శాంతిర్యాలీకి తమ సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు ప్రత్యక్షంగా ర్యాలీలో పాల్గొంటామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు మహేష్,శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు కుమార్, గిడ్డమ్మ, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాల్సిందే

విశాలాంధ్ర- పెద్దకడబూరు : కర్నూలుజిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఈనెల 16న కలెక్టరేట్ ఎదురుగా జరిగే ధర్నాను విజయ వం తం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం తాలూకా కార్యదర్శి ఆంజనేయ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాలు సరిగా కురవకపోవడంతో వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక పోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం ఎంత వరకు సమంజసమని సూటిగా ప్రశ్నించారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకే 16న మహా ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు.సీపీఐ,రైతుసంఘంల ఆధ్వర్యంలో జరుగు ధర్నా కార్యక్రమానికి సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పి. రామచంద్రయ్య హాజరవుతున్నారని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, వీరేష్, నరసప్ప, జయరాజు, మూకన్న, ఆటో కుంటెన్న తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేయండి

విశాలాంధ్ర -దేవనకొండ : రబీ పంటకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వేరుశెనగ విత్తనాల పంపిణీ తొందరగా ప్రాభించాలని మండల వ్యవసాయ సలహా చైర్మన్ సిద్ధం హంపిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సలహా మండలి సమావేశం ఏడిఏ మోహనవిజయ్‌కుమార్ సమక్షంలో నిర్వహించారు.సమావేశంలో వారు మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు త్వరగా ప్రారంభించి, తక్కువ రాకుండా చూడాలన్నారు.హంద్రీనీవా నీళ్ల ఎంతవరకు విడుదల చేస్తారో రైతులకి స్పష్టంగా అధికారులు తెలియజేయాలన్నారు. ఖరీఫ్ ఈ క్రాప్ బుకింగ్ ఈకేవైసీ ముగిసినప్పటికీ 632 మంది రైతులు ఈకేవైసీకి చేయించుకోలేదన్నారు.ఏఓ సురేష్ బాబు, ఏఈఓ రంగన్న, సభ్యులు మల్లికార్జున కందనాతి రంగన్న పాల్గొన్నారు.

బాబు అరెస్టుకి నిరసనగా జలదీక్ష

విశాలాంధ్ర -దేవనకొండ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక చిన్న చెరువులో జలదీక్ష చేశారు. పార్టీ కార్యాలయం నుండి గద్దెరాళ్ల గ్రామం లోని మారెమ్మవ్వ గుడి వరకు 4 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. బాబు క్షేమంగా ఉండాలని మారెమ్మ అవ్వ ఆలయంలో 51 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అక్రమంగా కేసు పెట్టి బాబుని జైల్లో ఉంచి సైకో జగన్ పైశాచిక ఆనందం పొందుతూన్నారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు జగన్‌కి తగిన గుణపాఠం చెప్పడం ఎంతో దూరం లేదన్నారు.వైసీపీ ఎన్ని కుట్రలు చేసిన చంద్రబాబు కడిగిన ముత్యం లాగా బయటికి వస్తాడన్నారు. బండిగింజల రంగన్న, ఉచ్చిరప్ప, మల్లయ్య, సర్పంచ్‌లు భాస్కర్, చెన్నమ నాయుడు, నాగరాజుగౌడ్, హనుమంతు, చిన్నరామప్ప,బాలకృష్ణ, ఎంపీటీసీ తిమ్మప్ప, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జునగౌడ్, సుంకన్న, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, వెంకటస్వామిగౌడ్, రమణారెడ్డి, బండ్లయ్య, తిమ్మప్ప, చిన్న రాముడు, యూనిట్ ఇంచార్జిలు రాజశేఖర్ గౌడ్, లతీఫ్, రాజగోపాల్ గౌడ్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పెద్దయ్య, బాలరంగడు, రాజసాబ్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

యాగంటికి పాదయాత్ర సాగించిన బీసీ ఇందిరమ్మ

విశాలాంధ్ర -బనగానపల్లె : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 'బాబుతో నేను సైతం' అనే నినాదంతో బాబు త్వరగా జైలునుంచి విడుదల కావాలని కోరుతూ శుక్రవారం మహిళలు, నాయకులు, యువకులతో కలిసి బీసీ ఇందిరమ్మ యాగంటికి పాదయాత్ర చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమె స్థానిక పార్టీ కార్యాలయం నుండి యాగంటి పుణ్యక్షేత్రం వరకు 13 కిలో మీటర్ల పాదయాత్రను కొనసాగించారు.అనంతరం శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి కి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అన్యాయంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు పరిశ్రమలు స్థాపించి యువతకు ఎన్నో వేల ఉద్యోగాలు కల్పించారని పేర్కొన్నారు. నేడు సీఎం జగన్ మోహన్ రెడ్డి స్వార్థ రాజకీయం, కమిషన్ కక్కుర్తితో పరిశ్రమలు రాష్ట్రం నుండి ఒక్కొక్కటిగా వెళ్లిపోతున్నాయన్నాని ఆరోపించారు. అందుకు అనుగుణంగా 2024 ఎన్నికల్లో యువత టీడీపీకి ఓటేసి గెలిపించుకొని, ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. ఆమెవెంట కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, టంగుటూరి సీనయ్య, గోపాల్‌రెడ్డి, సర్పంచులు తులసిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బురానుద్దీన్, బండి మౌలిశ్వర్‌రెడ్డి, పట్టనాధ్యక్షుడు ఖాసింబాబు, శంకేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, వెల్కమ్ అల్తాఫ్, ఖాదర్, లాయర్ నాగేంద్రరెడ్డిలు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : టీడీపీ అధికారంలోకి వచ్చాక చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ తెలుగుదేశం ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. నగరంలోని జొహరాపురంలోని నేషె గేరిలో టీడీపీ, జనసేన నేతలు కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిలో ముందుకు వెళుతుందన్నారు. కర్నూల్లో తాను ఎమ్మెల్యే అయితే ఇక్కడికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఒక్క పరిశ్రమ వచ్చినా వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రజల ఆదాయం కూడా పెరుగు తుందని వివరించారు. కర్నూలులోని చేనేతల ఇబ్బందులు తీరుస్తానని చెప్పారు. ప్రజలందరూ ఓట్లు ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లో ఉన్నట్లు తెలిపారు. తన తండ్రి హయాంలో చెక్‌డ్యాం నిర్మాణం కోసం తీసుకొచ్చి జీ.వోను నేటి పాలకులు పక్కన పెట్టేశారన్నారు. తాను గెలిచిన తర్వాత ప్రజల తాగునీటి కష్టాలు లేకుండా, రాకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటానని భరత్ హామీ ఇచ్చారు.

వైఎస్సార్ భీమా పేదలకు వరం

విశాలాంధ్ర- పెద్దకడబూరు : వైఎస్సార్ భీమా పేదలకు వరం లాంటిదని గ్రామ సర్పంచ్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడబూరుకు చెందిన మాల శంకరమ్మ అకాల మరణం చెందారు. వైఎస్సార్ భీమా కింద తక్షణ సహాయంగా రూ.10 వేలు బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ఇలాంటి పథకాలు ఎన్నో ఉన్నా కూడా వైఎస్సార్ భీమా అనే పథకం మాత్రం పేదలకు వరం లాంటిదన్నారు.

ప్రజాక్షేత్రం నుండి దూరం చేసేందుకు కుట్ర

విశాలాంధ్ర- పత్తికొండ: ప్రజాక్షేత్రం నుండి చంద్రబాబును దూరం చేసేందుకు జగన్ మోహన్ రెడ్డి కుట్ర పడుతున్నారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కేఈ.శ్యాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజానాయకుడు చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి 34 రోజులుగా జైలుకే పరిమితం చేసి, జైలులో కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా ఇబ్బందులకు గురిచేయడాన్ని దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. స్కిన్ అలర్జీ కారణంగా చంద్రబాబు ఎక్కువ వేడి వాతావరణాన్ని తట్టుకోలేరు అన్నారు. చంద్రబాబు నెల రోజుల్లో 5 కేజీల బరువు తగ్గడం ఆందోళన కలిగిస్తుందని, డీహైడ్రేషన్ వల్ల అస్వస్థకు గురయ్యేవరకు అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బాబు ఆరోగ్యంపై పబ్లిక్‌లో ఎమోషన్స్ రాకుండా జగన్మోహన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారన్నారు. చంద్రబాబును తక్షణమే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించాలని, ఆరోగ్యం మెరుగుపడేంత వరకు నిపుణుల బృందంతో నిత్యం పర్యవేక్షణలో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ముత్యాల తిరుపాల్, రామానాయుడు, ప్రమోద్ కుమార్ రెడ్డి, అశోక్‌కుమార్, సుధాకర్, వెంకటపతిలు పాల్గొన్నారు.

ప్రారంభమైన సభ్యత్వం

విశాలాంధ్ర- హొళగుంద : హొళగుంద మండలం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగ శుక్రవారం ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి నాగరాజు, జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు. తిక్కస్వామి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ముత్తన్నతో పాటు ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు గోపీనాయక్, మధు, సంజీవుడు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు ఏపీటీఎఫ్ సభ్యత్వం నమోదు దాదాపుగా 100 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా చేరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బి నాగరాజు మాట్లాడుతూ పెండింగ్‌లోని మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని, దసరాకు ఇస్తానన్న డీఏను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 1న జీతాలు చెల్లింపులు, జూలై 2023 నుంచి ఐఆర్ ప్రకటించాలన్నారు. హొళగుంద హైస్కూల్లో కన్నడ మీడియంని కూడా కొనసాగించాలని, డీఈవో పూల్‌లోని తెలుగు, హిందీ పండిట్లను రెగ్యులర్ ప్లేస్‌లో బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ముమ్ముందు ఏపీటీఎఫ్ ఉద్యమాల ద్వారా సాధిస్తామన్నారు.

వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా..

విశాలాంధ్ర -కర్నూలు : వినోదభరితమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న జీతెలుగు మరో బ్లాక్బస్టర్ సినిమాతో మీ ముందుకు రానుంది. మెగా హీరో సాయిధరమ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన సూపర్ హిట్ సినిమా 'బ్రో- ది అవతార్' ను ఆదివారం సాయంత్రం 6 గంటలకు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందించేందుకు సిద్ధమైంది.

హంద్రీనీవాలో ఫుల్.. ఆలూరు బ్రాంచ్‌లో నిల్

రైతు సమస్యలు పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర - చిప్పగిరి: హంద్రీనీవాలో పుష్కలంగా సాగు తాగునీరు పూర్తి సామర్థ్యంతో ప్రవహిస్తున్నప్పటికీ ఆలూరు బ్రాంచ్ కెనాల్‌లో మాత్రం తాగడానికి కూడా నీరు లేదని ఆయకట్టు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా కాలువ నుండి ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు సాగు, తాగునీరు అందిస్తూ వస్తున్నప్పటికీ ఆయకట్ట రైతులు తమ పొలాల్లో ఇల్లు గడవకపోయినప్పటికీ అప్పులు చేసి జొన్న, మిరప పంటలను సాగు చేయడం జరిగింది. అయితే అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వమో కానీ ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు నీరు బంద్ కావడం రైతులకు శాపంగా మారిందని ఆయకట్ట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా ముందుకు వెళ్లాలనే సాకుతో హంద్రీనీవాకు జీబీసీ - ఏబీసీ నాకు ఒకే దగ్గర నుండి సాగు తాగునీరును సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ జీబీసీ కాలువకు యధావిధిగా నీరు సరఫరా చేస్తూ ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు మాత్రం నీటి సరఫరా నిలిపివేయడంలో అంతర్యమేంటోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైన ప్పటికీ ఆయకట్ట కింద రూ.లక్షలు అప్పులు చేసి రైతులు పొలాల్లో పంటలుసాగు చేయడం జరిగిందని, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులను దృష్టిలో ఉంచుకొని ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు సాగు తాగునీరు అందించాల్సిన అవస రం ఎంతైనా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఆలూరు బ్రాంచ్ ఇరిగేషన్ డీఈ మంజునాథ ను వివరణ కోరగా ఆయకట్ట రైతులు ఏ ఒక్కరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఈనెల 20 తర్వాత బ్రాంచ్ కెనాల్‌కు సాగు, తాగునీరు విడుదల చేయడం జరుగుతుందని వెల్లడించారు.

మేడం...పంటలు ఎండుతున్నాయి సాగునీరు అందించండి

విశాలాంధ్ర గోనెగండ్ల: అలువాలకు చెందిన రైతులు వరిపంటకు నీళ్లులేక ఎండిపోతున్నాయని తుంగభద్ర దిగువ కాలువ నీటిని విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సృజనకువినతిపత్రం అందజేశారు. గోనెగండ్లలోని బీసీ కాలనీలో డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్లు కావాలంటూ ఆకాలనీ వాసులు వినతులు కలెక్టర్‌కు ఇచ్చారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో శుక్రవారం జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈస్పందనలో ఆయా శాఖలకు సంబంధించి 166 అర్జీలు అందాయి. రెవెన్యూశాఖ -84, పంచాయతీ రాజ్ -10, గృహ నిర్మాణం -13, సర్వే మరియు ల్యాండ్ రిజిస్టర్-13 అర్జీలున్నాయి. రెవెన్యూ శాఖలోని సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అలసత్వం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఉన్నత స్థాయి అధికారులు అదేశాలిచ్చారు.ముందుగా మండల పరిధిలోని హెచ్.కైరవాడిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డితో కలిసి కలెక్టర్ పారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఓపీలశాతం పెంచాలని మండల అధికారులకు ఆదేశించారు. వైద్య శిబిరంలో రోగులు, వృద్దులకు ఇచ్చిన మందులను పరిశీలించారు. వైయస్సార్ కంటి వెలుగులో భాగంగా కైరవాడి కి చెందిన చంద్రకాంతమ్మకు కళ్లద్దాలని అందించారు. గాజులదిన్నె సమీపంలోని సంజీవయ్య సాగర్ ప్రాజెక్టులో రూ. 53 కోట్లతో జరుగుతున్న ప్రాజెక్ట్ ఆధునికరణ వనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం, ప్రాజెక్టు కింద ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఎన్ని గ్రామాలకు తాగునీరు అందుతోందని ఇరిగేషన్ సూపరిండెంట్ రెడ్డి రాజశేఖ ర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అలాగే 400 ఎకరాలను సేకరించేందుకు దేవనకొండ, గోనెగండ్ల మండలాల్లో సర్వే జరుగుతోందని కలెక్టర్ కి వివరించారు. భూసేకరణ కు సంబంధించిన వివరాలతో ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్స్ ను జాయింట్ కలెక్టర్ కు ఇవ్వాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా గాజులదిన్నె ప్రాజెక్ట్ నీటిని త్రాగునీటి అవసరాల కోసం ఏప్రిల్, మే నెలల వరకు సంరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. పాత క్రస్ట్‌గేట్ల స్థానంలో నూతన గేట్ల ఏర్పాటు పనులు ఆమె పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, రంగారెడ్డి,ఇరిగేషన్ ఈఈ శైలేశ్వర్‌రెడ్డి, డీఈ విజయ్ కుమార్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసిల్దార్ వేణుగోపాల్ ఇరిగేషన్ ఏఈ,ఏ ఈలు ఆలీ,పరమేశు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎల్లార్తి ఉరుసు మహోత్సవం

విశాలాంధ్ర-హొళగుంద : మండలంలోని ఎల్లార్తిలో హజరత్ షేక్షావలి షాషావలి స్వాములవారి 361వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ప్రశాంతంగా ముగిసాయి. 3రోజులపాటు స్వామి వారి గంధం, ఉరుసు, జియారత్ వంటి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. హజరత్ షేక్షావలి శేషావలి జండా కట్ట దూద పీరా దాదా దాదిమ దర్గాలలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ఫాతిహాలు చదివించారు. స్వామివారి జియారత్ కార్యక్రమాలు దర్గా మాజీ పీఠాధిపతి నూర్‌బాబా ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉరుసు ఉత్సవంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండడానికి పత్తికొండ డీఎస్పి శ్రీనివాస్‌రెడ్డి, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీనివాసులు 100 మంది పోలీసు సిబ్బందితో భారీపోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవంలో భక్తులకు సర్పంచ్ కురువ చాముండేశ్వరి, వైసీపీ నాయకులు దర్గప్ప, ఎస్కే గిరిలు, తాగునీరు విద్యుత్ మౌలిక సదుపాయాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సయ్యదా సబిహా పర్వీన్, దర్గా ఈవో అబ్దుల్ రెహమాన్, ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులతో దర్గాలు కిటకిటలాడాయి. తిను బండారాల అంగళ్ళు, గాజులంగళ్ళు ,ఆట వస్తువుల దుకాణాల వద్ద కొనుగోలుదారుల రద్దీ ఎక్కువ కనిపించింది. ఆదోని, బళ్ళారి డిపోల నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిచాయి. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉరుసు మహోత్సవం లో అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు మాజీ దర్గా పీఠాధిపతి నూర్ బాబా తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - చిప్పగిరి: రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని ఆలూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ అన్నారు. శుక్రవారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో మండల రైతు సంఘం చైర్మన్ కమలమ్మ అధ్యక్షతనలో రైతుల సమావేశమును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రైతులకు ఎలాంటి కష్టాలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు రైతు సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రైతులకు ఖరీఫ్ రబీ సీజన్లకు సంబంధించి సరైన సమయంలో సబ్సిడీ విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలోని గ్రామాలలో రైతుల సమస్యలు ఉంటే తక్షణమేసభ దృష్టికి తీసుకొని వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రైతులకు అవసరమయ్యే జిప్సం, స్ప్రెయ్యార్లు, తోపాటు రైతులకు అవసరమయ్యే పరికరాలను సబ్సిడీ కింద రైతులకు మంజూరు చేయాలని, అదేవిధంగా 15వేల ఎకరాలకు ఒక కస్టమ్ అవే రింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని చైర్మన్ దృష్టికి తీసుకురావడం జరిగింది. రైతుల అడిగిన సమస్యలపై జిల్లా కేంద్రంలో జరిగే సమావేశంలో జిల్లా అధికారుల దృష్టికి నివేదిక రూపంలో అందజేస్తామని మండల వ్యవసాయ అధికారిని జయలక్ష్మి తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని జయలక్ష్మి, మండల రైతు సంఘం కమిటీ సభ్యులు బాలకృష్ణ, రాజన్న, శేఖన్న, సతీష్, మండల విస్తరణ అధికారిని రమాదేవి, ఆయా గ్రామ ఎంపీఈఓలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం

విశాలాంధ్ర- పెద్దకడబూరు : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గవిగట్టులో సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజలకు అవసరమైన అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా వంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీరగోవిందమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారస్టాళ్లను సందర్శించి వంటలను రుచి చూశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ వీరేంద్రగౌడ్, సచివాలయాల మండల కన్వీనర్ రవిచంద్రారెడ్డి, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు మహాదేవ, గాదిరెడ్డి, మునిస్వామి, బంగారప్ప, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య.. వైద్యానిదే అగ్ర తాంబూలం

విశాలాంధ్ర - డోన్ రూరల్: విద్య వైద్యరంగాలకు సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి అగ్రస్థానం ఇస్తున్నారని ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దొరపల్లిలో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న వైద్య ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో ఎవ్వరు కూడా అనారోగ్య సమస్యలతో బాధపడకూడదని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి నిరుపేదలకే కాకుండా.. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న సదుద్దేశంతోనే వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వారు తెలిపారు. జడ్పీటీసీ రాజ్‌కుమార్, సర్పంచ్ గంగాదేవి, ఉపసర్పంచ్ సిద్దయ్య, చిరంజీవిలు పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లం వూట ధ్వంసం

విశాలాంధ్ర -హొళగుంద : నేరణికి దేవరగట్టు బన్నీ ఉత్సవం 24న జరగనున్న సందర్భంగా శుక్రవారం ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సెబ్ సీఐ వెంకట్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత దాడులు జరిపారు. ఈదాడుల్లో 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారా, 96 కర్ణాటక టెట్రా పాకెట్లను స్వాధీన పరుచుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బన్నీ ఉత్సవం సందర్భంగా మండలంలో ఎవరైనా సరే అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాటుసారతయారీ, అమ్మినవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈదాడుల్లో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, రామాంజనేయరెడ్డి, పెద్దన్న , హెడ్గాంగార్డు గోపాల్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి



విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జి సృజన నిర్వహించారు. అందులో భాగంగా మండలంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల బృందం విలేకరుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విలేకరుల బృందం తమ సమస్యలైన అక్రిడేషన్‌లు, ప్రతి జర్నలిస్టలకు స్థలమిచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు.మా పిల్లలకు విద్య, వైద్యంలోనూ వంద శాతం రాయితీ ఇవ్వాలని కోరారు.జర్నలిస్టులకు ప్రభుత్వం సామాజిక పింఛన్లు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కలెక్టర్ తప్పకుండా మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని,అక్రిడేషన్లు రానివారికి రెండో విడతలో అవకాశం కల్పిస్తామన్నారు.జర్నలిస్టులు అక్బర్‌వలి, గౌస్, బాబునాయుడు, కరుణాకర్, ఈశ్వర్, జయన్న, హనీఫ్, అహమ్మద్ హుస్సేన్, నరేష్, గజేంద్రరెడ్డిలు పాల్గొన్నారు.

పేదలకు వరం..జగనన్న సురక్ష

విశాలాంధ్ర- దేవనకొండ రూరల్: పేదలకు వరం జగనన్న సురక్ష అని వైసీపీ మండల కన్వీనర్ కప్ప ట్రాళ్ల మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం కప్పట్రాళ్లలో జగన న్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసీపీమం డల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. దీనిద్వారా అనేక మంది నిరుపేదలకు వైద్యం అందించి వారి గుండెల్లో చెరగని ముద్ర వేసు కున్నారనీ గుర్తు చేశారు. 108 అంబులెన్స్ ప్రారంభించి కాల్ చేసిన అర గంట లోపే బాధితులను హాస్పిటల్లో చేర్పించి ఎంతోమంది ప్రాణాలు కాపాడిన ఘనత వైఎస్ఆర్‌కే దక్కిందన్నారు. తండ్రి అడుగు జాడల్లోనే ము ఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సైతం ముందుకు సాగుతూ వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో గౌరీదేవి, ఈవోపీఆర్డీ సూర్య నారాయణ, వైద్యులు, విజయ భాస్కర్, అత్తవులయ్య, వివేక్, ఉదయ్ శం కర్, సెక్రటరీ నాగార్జున, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.